నగర అభివృద్ధికి సహకరించండి

- నగరపాలక సర్వసభ్య సమావేశంలో మేయర్ బీవై రామయ్య
- 60 అంశాలపై చర్చ
- రూ.32 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం
- చెత్త పన్ను తగ్గించాలని ఏకగ్రీవ తీర్మానం





సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య, హాజరైన పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, సభ్యులు

కర్నూలు (టౌన్): చిల్లర రాజకీయాలు పక్కన పెట్టి నగర అభివృద్ధికి సహకరించాలని మేయర్ బీవై రామయ్య టీడీపీ కౌన్సిలర్లను కోరారు. బుధవారం జరిగిన నగరపాలక సర్వసభ్య సమావేశంలో ఎజెండాలోని అంశాలపై చర్చను పక్కదోవ పట్టించేలా టీడీపీ కౌన్సిలర్లు వ్యవహరిస్తుండటంతో ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేశారు. తమతమ వార్డులను అభివృద్ధి చేసుకోవాలని ఉంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కుల, మత, రాజకీయాలకు తావులేకుండా అన్ని వార్డులలో సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని, లబ్ధిదారుల్లో టీడీపీ శ్రేణులు సైతం ఉన్నారని గుర్తు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కమిషనర్ భార్గవ్‌తేజ, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, కార్పొరేటర్లు లక్ష్మీకాంతారెడ్డి, సిత్రా సత్యనారయణమ్మ, ఆర్షియా ఫర్హీన్, క్రాంతికుమార్, షేక్ యూనస్‌బాషా, కైప పద్మలతా రెడ్డి, ఫర్హాజ్‌ఖాన్, నాగలక్ష్మీరెడ్డి, సుదర్శన్ రెడ్డి, నారాయణ రెడ్డి, సాంబశివరావు, నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అధికారులు పాల్గొన్నారు. మొత్తం 60 అంశాలపై చర్చించారు. చెత్త పన్నును తగ్గించాలని ఇద్దరు ఎమ్మెల్యేలు సిఫార్స్ చేయడంతో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే దాదాపు రూ.32 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానించారు.

టీడీపీ కార్పొరేటర్లపై ఎమ్మెల్యే ఫైర్

కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతున్న సమయంలో 8 వ వార్డు టీడీపీ పార్టీ కార్పొరేటర్ పరమేష్ అడ్డు తగలడంతో ఆయనపై ఫైర్ అయ్యారు. కూర్చో వయ్యా ముందు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం నగరంలో ఉచిత కుళాయి కనెక్షన్లు అంటూ మోసం చేసిందన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి చేస్తున్నామని, ముఖ్యమంత్రి నాయకత్వంలో కులం మతం, పార్టీలు చూడకుండా కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. నగరంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కూడా జగనన్న విద్యా దీవెన, పెన్షన్లు, అమ్మ ఒడి, చేయూత వంటి అనేక పథకాల ద్వారా లబ్ధి పొందడం లేదా అని ప్రశ్నించారు.

శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

విలీన గ్రామాలైన లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడులో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కౌన్సిల్‌ను కోరారు.లక్ష్మీపురం గ్రామంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలన్నారు. పందిపాడు, స్లమ్ ఏరియాల్లో ఇంటి పన్నులు తగ్గించాలన్నారు. గడప గడప కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడమే గాకుండా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీకర్ సెక్షన్ కాలనీలో మురుగు నీటి వ్యవస్థ మెరుగు పరచాలన్నారు.

రాహుల్‌ను ప్రధానిని చేద్దాం

కర్నూలు(సెంట్రల్): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు కార్యకర్తలకు సూచించారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం లోకేష్‌ను మంత్రాలయం నియోజకవర్గ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా, బి.అనందరాజును పెద్దకడబూరు మండల అధ్యక్షుడిగా నియమించారు. కార్యక్రమంలో మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాబురావు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం

- ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు (సెంట్రల్): గడప గడపలో సంతోషమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన అశోక్‌నగర్ పాలకొట్టాల వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేస్తున్నారని, ఆయన ఆశయ సాధన కోసం తామంతా సైనికుల్లా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 46వ వార్డు కార్పొరేటర్ వాసు, నాయకులు యూసుఫ్, భాస్కర్‌రెడ్డి, మల్లి, హసీనా, ఆంజనేయులు, చందు, సురేష్, దావూద్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ బుధవారం ఆయన తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ఫిట్నెస్‌తో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): ఫిట్నెస్‌తోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి జంప్‌రోప్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే విద్యార్థి దశలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. వచ్చే నెలలో 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో జంప్‌రోప్ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, క్రీడా ప్రతినిధులు చిన్న సుంకన్న, అవినాష్‌శెట్టి పాల్గొన్నారు.

సీపీఎం సంతకాల సేకరణ



గడియారం ఆసుపత్రి సమీపంలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): నిత్యావసరాలు, పెట్రోలు, డీజిలు, గ్యాస్, కరెంట్, ఆర్టీసీ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం పోరుబాట పట్టింది. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగరంలోని పలు కూడళ్లలో సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టింది. సీపీఎం నగర కార్యదర్శిఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో గడియారం ఆసుపత్రి, కృష్ణానగర్ ఐటీసీ వద్ద సీపీఎం న్యూసిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ సాయిబాబా, 32వ వార్డులో కె.సుధాకరప్ప, 23వ వార్డులో టి.సుంకన్న, కలెక్టరేట్ ఆవరణలోని జి.పుల్లారెడ్డి స్వీట్స్ షాపు సమీపంలో కె.రామకృష్ణ, సీపీఎం ఓల్డ్‌సిటీ కమిటీ సభ్యుడు అబ్దుల్ దేశాయ్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు.

క్లుప్తంగా

డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్



జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీసుకొచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ కార్డు ప్రైమ్‌ను వినియోగంలోకి తీసుకోస్తే డాక్యుమెంట్ రైటర్లు వీధిన పడతారని ఏపీ స్టేట్ దస్తావేజు లేఖరుల అసిసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం బంద్ పాటించారు. డాక్యుమెంట్ రైటర్లందరూ పెన్‌డౌన్ పాటించడంతో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అంతకుముందు డాక్యుమెంట్ రైటర్లు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్నో ఇళ్లుగా రైటర్లుగా జీవనం చేస్తున్న తమపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. ప్రైమ్ కార్డు సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తే ప్రజలే నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తారన్నారు. అప్పుడు తమ అవసరం లేకుండా పోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలని కోరారు.

డోన్ వాసికి బంగారు పతకం



వీసీతో అవార్డు అందుకుంటున్న వి.ధర్మ పెద్దయ్య(ఫైల్)

కర్నూలు సిటీ: డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన వి. ధర్మ పెద్దయ్య ఎం.ఏ రూరల్ డెవలప్‌మెంట్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. 2015–17లో నాగార్జున యూనివర్సిటీలో పీజీ ఆర్‌డీ పూర్తి చేశారు. ఆ బ్యాచ్‌లో మొదటి స్థానంలో రావడంతో ఈ నెల 29న జరిగిన 39వ స్నాతకోత్సవంలో వర్సిటీ వీసీ పి.రాజశేఖర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నానని ధర్మ పెద్దయ్య బుధవారం తెలిపారు.

రాజకీయ తరగతులను జయప్రదం చేయాలి

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో తిరుపతిలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర కోరారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా మొదటిరోజు జార్జిరెడ్డి స్వగ్రామమైన చల్లవారిపల్లె నుంచి ఎస్వీ యూనివర్సిటీ వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీకి జార్జిరెడ్డి సినిమా డైరెక్టర్ హాజరవుతారన్నారు. 9, 10 తేదీల్లో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. సమావేశంలో నాయకులు రమణకుమార్, నరసింహారెడ్డి, గోవర్ధన్, శంకర్, ధనశేఖర్ పాల్గొన్నారు.


'నారాయణ' విద్యార్థులకు అభినందనలు



విజేతలతో ఎమ్మెల్యే ఎం.ఏ హఫీజ్‌ఖాన్, నారాయణ స్కూల్స్ ఏజీఎం రమేష్‌కుమార్

కర్నూలు సిటీ: తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ చూపిన నారాయణ స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ నెల 24, 25 తేదీల్లో బెంగళూరులో జరిగిన వెస్టర్న్ కప్ మొదటి జాతీయ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో తమ స్కూల్ విద్యార్థులు ఎం.జి ఇందిరా ప్రియదర్శిని(10వ తరగతి), డి.మహమ్మద్ షహాల్ అష్రఫ్(9వ తరగతి), వై.హర్షవర్ధన్ (8వ తరగతి), షేక్ మొహమ్మద్ అద్నాన్(5వ తరగతి) బంగారు పథకాలు సాధించారని స్కూల్ ఏజీఎం రమేష్‌కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రిన్సిపాల్స్ దినేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, అజీజ్, తైక్వాండో శిక్షకులు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

కర్నూలు(సెంట్రల్): వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడకు వెళ్లిన వారిని అరెస్టు చేయడం అన్యాయమని, అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని ఏపీ వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి, కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అరెస్టులపై బుధవారం కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరితే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, వెంకటేశ్వర్లు, ధనుంజయ, వీరేష్, రంగస్వామి, రంగన్న, మౌలాలి, జయప్ప పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు ఉత్తమ సేవా పురస్కారాలు



ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న సతీస్‌కుమార్, సుబ్బయ్య

కర్నూలు(సెంట్రల్): ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రలకు ఉత్తమ సేవా పురస్కారాలను ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తన కార్యాలయంలో అందజేశారు.ప్రతినెలా ఒక్కరికి చొప్పున ఆరోగ్యమిత్రలకుఅవార్డులను అందజేస్తారు. అందులో భాగంగా జూన్ మాసానికి సంబంధించి సుశీల నేత్రాలయ ఆసుపత్రి సేవా ఆరోగ్య మిత్ర సతీష్‌కుమార్,జూలై మాసానికి విజయ హాస్పిటల్ సేవా ఆరోగ్య మిత్ర సుబ్బయ్యకు ప్రశంసా పత్రంతోపాటు రూ.5 వేలచొప్పున నగదు బహుమతులు ఆమె అందజేశారు.

ప్రణాళికతో చదివితే పక్కా విజయం



సీఐని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, అభ్యర్థులు

కర్నూలు కల్చరల్: ప్రణాళికతో చదివితే పక్కా విజయం సిద్ధిస్తుందని సీఐ వి.శ్రీధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్‌ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్, థియరీ పరీక్షకు సంబంధించిన విషయాలపై సీఐ అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు, యువతకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, లైబ్రేరియన్‌లు బాషా, నసీమ తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



పాత బస్టాండ్‌లోని స్వీట్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ): వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ హెచ్చరించారు. బుధవారం పాత బస్టాండ్, వినాయక ఘాట్ ప్రాంతాల్లో లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని రెండు స్వీట్ దుకాణాల్లో తూకం తక్కువ వేస్తుండడంతో కేసులు నమోదు చేసి రూ.20 వేలు జరిమానా వేశారు. వినాయక ఘాట్ వద్ద బండ్లపై విక్రయిస్తున్న పండ్లు వ్యాపారుల తూకాల్లో స్వల్ప తేడాలు రావడంతో రెండు కేసులు నమోదు చేసి రూ.2 వేలు అపరాధ రుసుం విధించారు. తనిఖీలో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రాముడు ఉన్నారు.

'రాఖీ' సందడి

కర్నూలు కల్చరల్: అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమాభిమానాలు, అనురాగ ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ సందడి బుధవారం చోటు చేసుకుంది. నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో పలువురు కార్పొరేటర్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు రాఖీ కట్టి తమ సోదర ప్రేమను చాటుకున్నారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, కార్పొరేటర్ చిట్రా సత్యనారాయణమ్మ, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కో ఆప్షన్ మెంబర్ చాట్ల మేరీ, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, అర్షియా ఫారిన్, సుజాత, విజయలక్ష్మి, కైపా పద్మలతలు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

- మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డికి గిప్సన్ కాలనీలోని తన స్వగృహంలో పత్తికొండ మాజీ సర్పంచ్ సోదరి నాగరత్నమ్మ రక్షాబంధన్‌ను పురస్కరించుకొని రాఖీ కట్టి మిఠాయి తినిపించి ఆశీర్వదించారు. కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి ఉన్నారు.

ఎన్‌ఆర్‌సీలో పిల్లలకు పోషకాహారం



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పోషకాహార లోపంతో బాధపడే పిల్లలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పోషకాహారాన్ని అందిస్తోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ, వెంకటరమణ కాలనీ సచివాలయం పరిధిలోని అజ్మద్దీన్ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలను క్రమం తప్పకుండా ఇచ్చి ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్‌లు ఇవ్వాలన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేసి ఏఎన్‌ఎం హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి మెనూ, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవతి, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై దృష్టి సారించాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య





మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాల్లో వారంతపు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇళ్ల నిర్మాణాలపై ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హౌసింగ్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా బ్రిక్స్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌతాళం మండలంలో ఇళ్ల నిర్మాణాలను పెంచాలన్నారు. పూర్తయిన వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఆదోని లేవుట్ పరిసరాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో పనులు జరిగేందుకు కొంత జాప్యం జరిగే అవకాశం ఉందని అక్కడి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా మరో ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలూరు, చిప్పగిరి మండలాల్లో బేస్‌మెంట్ లెవెల్లో ఉన్న ఇళ్లను రూఫ్ లెవల్‌కు తీసుకురావాలన్నారు. ఓర్వకల్లు లేవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, అక్కడ అన్ని రకాల మౌలిక సదుపాయాలతోపాటు ఆర్బీని నిర్మించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునుడు, పీఆర్ ఎస్‌ఈసుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

ఓటరు సర్వేను పకడ్బందీగా చేపట్టండి

ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య బీఎల్‌ఓలను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. బూత్ స్థాయిలో తప్పనిసరిగా ఒక్కో ఇంటిలోని ఓటర్లను పరిశీలించిన తరువాతే బీఎల్ఓలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. కొన్ని చోట్లా అవసరమైతే రెండో సారి కూడా ఓటరు జాబితాను పరిశీలించేందుకు బీఎల్‌ఓలు రాజకీయ పార్టీల ఏజెంట్లతో వెళ్లాలన్నారు. నగర మేయర్ బీవై రామయ్య ఓటు తొలగింపు తప్పిదంలో ఏఈఆర్‌ఓపై క్రమ శిక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే మేయర్ ఓటును కల్లూరులో పునరుద్ధరిస్తున్నట్లు ఆమె వివరించారు. సమావేశంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు సత్యనారాయణ గుప్తా, ఎల్వీ ప్రసాద్, నరసింహవర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు పూర్తి చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మండలాధికారులతో సమీక్షించారు. ఎన్‌ఆర్‌జీఎస్ కింద అమృత్ సరోవర్, చెరువుల పూడిక తీత, ఇంకుడు గుంతలు, ఫాంపాండ్‌లు తదితర పనులను జాబ్ కార్డు ఉన్న వారితో చేయించాలన్నారు. ఉద్యాన పంటల ప్రోత్సాహంలో ఐదెకరాల పొలం ఉన్న రైతుర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, పీఆర్ ఈఈ మద్దన్న, డిప్యూటీ ఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్క అదృశ్యంపై ఫిర్యాదు

కర్నూలు: పెంపుడు కుక్క అదృశ్యమైందని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని హోసన్నా మందిరం దగ్గర నివాసముంటున్న ఆవుల జాన్సన్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈనెల 29న సాయంత్రం తాను నీళ్ల పడుతూ ఉండగా తన పెంపుడు కుక్క (లాబ్రడార్ జాతికి చెందిన డబుల్ బోన్ మేల్ డాగ్ ముద్దుపేరు బన్నీ) ఇంటి ఆవరణం నుంచి బయటకు వెళ్లిందని, కాసేపటికే చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన డాగ్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరాడు. ఫిర్యాదును పోలీసులు జనరల్ డైరీ(జీడీ)లో నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9121101061 ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



లాబ్రడార్ జాతి కుక్క (బన్నీ)

ఆరోగ్యానికి పెద్దపీట

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ముగ్గురికి సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.3,60,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ వర్తించని రోగాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

కర్నూలు (న్యూసిటీ): విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు స్టీవార్డెన్లను ఆదేశించారు. అన్నం నాణ్యతగా ఉండటం లేదని బాయ్స్ హాస్టల్ విద్యార్థులు కొంతమంది యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌టీకే నాయక్, చీఫ్ వార్డెన్ భరత్‌కుమార్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి బుధవారం హాస్టల్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రతిరోజూ తప్పనిసరిగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎంత మంది భోజనం చేస్తున్నారో హాజరు వేసుకోవాలని స్టీవార్డెన్లకు రిజిస్ట్రార్ సూచించారు. అనంతరం హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని వర్కర్లకు సూచించారు. త్వరలో నూతన మెస్ కమిటీని ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.